క్లుప్తంగా

కెరమెరి ఎంపీడీవోగా మహేందర్



బాధ్యతలు స్వీకరిస్తున్న మహేందర్

కెరమెరి: మండల ఎంపీడీవోగా మహేందర్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన సత్యనారాయణగౌడ్ జైనూర్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో పెంచికల్‌పేట్ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న మహేందర్ వచ్చారు. ఈ సందర్భంగా సత్యనారాయణగౌడ్‌తో పాటు ఎంపీడీవో సిబ్బంది మహేందర్‌ను సన్మానించారు. ఎంపీవో సుదర్శన్, సుధాకర్ ఉన్నారు.

'బెల్టు షాపులు మూసివేయాలి'

వాంకిడి: 'సర్పంచ్ గారు మా వాడలోని కల్లు దుకాణాలు బంద్ చేయించండి' అంటూ వాంకిడి మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన పలువురు మహిళలు మంగళవారం సర్పంచ్ తుకారాంకు వినతిపత్రం అందించారు. కాలనీలో నాలుగు బెల్టు షాపులు ఉన్నాయని వారు తెలిపారు. పురుషులు ప్రతిరోజూ మద్యం తాగొచ్చి ఇళ్లల్లో గొడవ పెడుతున్నారని విన్నవించారు. మద్యం మత్తులో పేకాటకు బానిసలుగా మారడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

పార్టీలకు అతీతంగా ప్లీనరీకి హాజరు కావాలి

ఆసిఫాబాద్: హైదరాబాద్‌లోని కేబీఆర్ కన్వెన్షన్‌లో ఈ నెల 15న నిర్వహించే బీసీ రాజకీయ ప్లీనరీకి పార్టీలకు అతీతంగా హాజరుకావాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. అన్ని మండలాలకు చెందిన బీసీ నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొని ప్లీనరీని విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ పరిష్కార వేదిక

కౌటాల: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఏడీఈ రాజేశ్వర్ మంగళవారం తెలిపారు. కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్ మండలాల్లోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కార్యక్రమం ఉంటుందని, పరిష్కార వేదిక చైర్మన్ ఈశ్వరయ్య, అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు.

పద్మశాలీ సంఘం ఎన్నికలు విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్: పద్మశాలీ సంఘం జిల్లా ఎన్నికలకు పూర్తి సహకారం అందిస్తామని పద్మశాలీ సేవా సంఘం మండల అధ్యక్షుడు కోమటిపెల్లి లింగయ్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లాలోని అన్ని మండలాల కార్యవర్గ సభ్యుల నిర్ణయం మేరకు ఈ నెల 23న నిర్వహించనున్న జిల్లా పద్మశాలీ సేవా సంఘం ఎన్నికలను విజయవంతం చేస్తామన్నారు.

ప్రయాణ కష్టాలు..!



బురదమయంగా రోడ్డు

దహెగాం: కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగులో ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు తెగిపోవడంతో వాహనాలు పెంచికల్‌పేట్ మీదుగా వెళ్తున్నాయి. లగ్గాం ఎక్స్‌రోడ్డు నుంచి పెంచికల్‌పేట్ పెద్దవాగు వరకు రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. రోడ్డుపై మట్టిపోసి ఉండడంతో సోమవారం కురిసిన వర్షానికి రోడ్డంతా బురదమయంగా మారింది. దీంతో మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన వారసంతకు వచ్చే వాహనాలు బురదలో ఇరుక్కుపోయాయి. ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

'నిరవధిక సమ్మెకు సిద్ధం'

ఆసిఫాబాద్‌అర్బన్: వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంల డిమాండ్ల సాధనకు నిరవధిక సమ్మె చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ స్పష్టం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండు రోజుల సమ్మెలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేసి, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పనిభారం తగ్గించి 8 గంటల పనివిధానం అమలు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వసంత, ప్రమీల, రజని పాల్గొన్నారు.

వైద్యాధికారి నియామకమెప్పుడో?

- రాజీనామా చేసిన కెరమెరి పీహెచ్‌సీ వైద్యుడు
- ఐదు రోజులైనా నియమించని వైనం
- అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందిస్తున్న ఇతర సిబ్బంది



వైద్యాధికారి లేకపోవడంతో ఆత్మహత్యాయత్నం చేసిన రాముకు వైద్యం చేస్తున్న ఫార్మసిస్టు



కెరమెరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కెరమెరి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యాధికారి లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ విధులు నిర్వహించిన వైద్యాధికారి వెంకటేశ్ రాజీనామా చేసి ఐదు రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఎవరిని నియమించలేదు. వర్షాకాలం కావడంతో ఏజెన్సీ ఏరియాలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మండలవాసులు ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. మంగళవారం గోండ్‌ఝురి గ్రామానికి చెందిన కినక రాము అనే వ్యక్తి గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు వెంటనే కెరమెరి పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. వైద్యాధికారి లేకపోవడంతో గత్యంతరం లేక ఎంఎల్‌హెచ్‌పీ మమత, ఫార్మసిస్ట్ ఖలీల్ చికిత్స అందించారు. అనంతరం రామును ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

ప్రతీరోజు 100కిపైగా ఓపీ..

మండలంలో మొత్తం 31 గ్రామపంచాయతీలు, 156 గ్రామాలు, 32,543 జనాభా ఉంది. కెరమెరి పీహెచ్‌సీతో పాటు 8 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. మండలంలో ఒకే పీహెచ్‌సీ ఉండడంతో ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా మండలవాసులు కెరమెరి పీహెచ్‌సీకి రాక తప్పదు. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు ఉండాల్సి ఉండగా మొన్నటి వరకు ఒక్కరే విధులు నిర్వహించారు. అయితే సదరు వైద్యాధికారి రాజీనామా చేయడంతో వైద్యం అందించేవారు కరువయ్యారు. ఇక్కడికి ప్రతీరోజు 100మందికి పైగా రోగులు వైద్య పరీక్షలు నిమిత్తం వస్తుంటారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రోగుల సంఖ్య పెరిగే అవకాశం కూడా ఉంది. ప్రతీ నెల 35 నుంచి 40 వరకు డెలివరీలు నమోదై జిల్లాలోనే కెరమెరి పీహెచ్‌సీ మూడోస్థానంలో ఉంది. అయితే వైద్యాధికారులతో పాటు ఇతర సిబ్బందిని నియమించడంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

హైరిస్క్ గ్రామాల్లో ఇబ్బందులు

మండలంలోని జోడేఘాట్, బాబేఝురి, పరంధోళి, అంతాపూర్, నిషాని, ఆగుర్‌వాడ గ్రామ పంచాయతీల్లో కొన్ని హైరిస్క్ గ్రామాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాలకు ఎలాంటి బస్సు సౌకర్యం లేకపోవడంతో పాటు మొబైల్ నెట్‌వర్క్ కూడా అందుబాటులో ఉండదు. ఆయా గ్రామాల్లోని ఆదివాసీల్లో రక్తహీనత అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో వైద్యాధికారి లేకపోవడంతో ఆయా గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి వైద్యం అందించే ఆస్కారం లేకుండా పోయింది.

అధికారులు స్పందించాలి



సీజనల్ వ్యాధులు ప్రబలే సమయం కావడంతో వైద్యాధికారి లేనందున మండలవాసులు ఆందోళన చెందుతున్నారు. ఐదు రోజులుగా వైద్యాధికారి లేకుండానే పీహెచ్‌సీ కొనసాగుతోంది. అధికారులు స్పందించాలి. వెంటనే వైద్యాధికారిని నియమించాలి.

– పెందోర్ మోతిరాం, ఎంపీపీ

ఆగని ప్లాస్టిక్ వినియోగం

- విచ్చలవిడిగా వాడకం
- కరువైన అధికారుల పర్యవేక్షణ
- నేడు పేపర్ బ్యాగ్ డే



కౌటాల వారసంతలో ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

కౌటాల: పర్యావరణానికి ముప్పు తెస్తున్న ప్లాస్టిక్ నివారణకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు. ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్ల కారణంగా వాతావరణ సమతుల్యత దెబ్బతినడంతో పాటు భయంకరమైన క్యాన్సర్ వ్యాధి, అనేక ఇతర అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్‌ను కాల్చడం వల్ల కర్బన ఉద్గారాలు పెరిగి భూతాపం సమస్య ఏర్పడుతోంది. ప్లాస్టిక్‌తో ఎన్నో అనర్థాలు ఉన్న దృష్ట్యా పేపర్ బ్యాగులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. దీనికోసం ఏటా జూలై 12న పేపర్ బ్యాగు డే నిర్వహిస్తున్నారు.

విచ్చలవిడిగా వినియోగం

పాలిథీన్ కవర్ల వాడకంతో ఎన్నో అనర్థాలు ఉన్నాయనే కారణంతో ప్రభుత్వం ప్లాస్టిక్‌ను నిషేధించింది. కానీ అమలు మాత్రం జరగడం లేదు. గ్రామాల్లో జీపీల ఆధ్వర్యంలో జరుగుతున్న చెత్త సేకరణలో అధిక శాతం ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్ల నిషేధం ఉన్నా చెత్త కుప్పల్లో విచ్చలవిడిగా కవర్లు ఉండడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.

అవగాహన కల్పిస్తున్నాం

ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించేందుకు వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం దెబ్బతింటుంది. ఇటీవల కౌటాల వారసంతలో తనిఖీలు చేసి వ్యాపారుల వద్ద నుంచి ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నాం. జరిమానాలు విధించాం. కౌటాలలోని అన్ని దుకాణాల్లో సైతం తనిఖీలు చేసి నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయిస్తున్న వ్యాపారులకు జరిమానాలు విధిస్తాం. ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతీ ఒక్కరు సహకరించాలి.

– ఎస్. సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శి, కౌటాల

నేడు పేపర్ బ్యాగ్ డే..

పేపర్ బ్యాగులపై అవగాహన పెంచేందుకు ప్రపంచ వ్యాప్తంగా జూలై 12న పేపర్ బ్యాగ్ డే నిర్వహిస్తున్నారు. పర్యావరణానికి హానికరంగా మారిన ప్లాస్టిక్ బ్యాగుల స్థానంలో పేపర్ బ్యాగులు వాడేలా ప్రోత్సహించడం పేపర్ డే ముఖ్య ఉద్దేశం. పేపర్ బ్యాగులు 3 నెలల్లో భూమిలో కలిసిపోతాయని, మొక్కలకు ఎరువుగా మారుతాయని, వాటివల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు. ప్లాస్టిక్‌కు బదులుగా జనపనార, కాగితం ఉత్పత్తుల వాడకంపై ప్రజలను చైతన్యవంతం చేయాల్సి ఉంది. ప్లాస్టిక్ నిషేధంలో సామాజికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించాలని పలువురు పేర్కొంటున్నారు.



పేపర్ బ్యాగులు

రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి



దరఖాస్తులు అందజేస్తున్న రైతులు

బెజ్జూర్: మండలంలోని అన్నదాతలు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఈవో శ్రీధర్ అన్నారు. మంగళవారం మండలంలోని సోమిని రైతువేదికలో కొత్తగా పట్టా పాస్‌బుక్ వచ్చిన రైతుల నుంచి బీమా కోసం దరఖాస్తులు స్వీకరించారు. రైతుబీమా దరఖాస్తు ఫారంతో పాటు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డ్, నామినీ ఆధార్ కార్డ్ జిరాక్స్‌లు జత చేయాల్సి ఉంటుందన్నారు.

కౌటాలలో..

కౌటాల: అర్హులైన రైతులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబీమా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఏఈవో చౌదరి అంజన్న అన్నారు. మంగళవారం మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామంలో రైతుల నుంచి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోరేతు చరందాస్ పాల్గొన్నారు.

డాంబర్ ప్లాంటును వేరే ప్రాంతానికి తరలించాలి

రెబ్బెన: రాంపూర్ గ్రామానికి అతి సమీపంలో ఉన్న డాంబర్ ప్లాంటును వేరే ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు చాపిడి పురుషోత్తం అన్నారు. మంగళవారం తహసీల్దార్ మల్లికార్జున్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా సహాయ కార్యదర్శి శివ, మండల సహాయ కార్యదర్శి చల్లూరి కృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోనప్ప సేవలు అభినందనీయం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమం గొప్ప సంకల్పమని రాష్ట్ర ఐటీసీ మేనేజర్ ఉమాకాంత్, కార్పొరేట్ రిలేషన్స్ హెడ్ అర్చన, ఐటీసీ బృందం సభ్యులు అన్నారు. మంగళవారం కోనప్ప, జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడేలతో కలిసి నిత్యాన్నదాన సత్రాన్ని సందర్శించారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

దహెగాం: మండల కేంద్రంలో మంగళవారం రేణుకా ఎల్లమ్మ బోనాల పండుగను గౌడ కులస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఎల్లమ్మ ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా ఎల్లమ్మ బోనాల పండుగ జరుపుకుంటామని వారు పేర్కొన్నారు.

14న మోకుదెబ్బ సమావేశం

రెబ్బెన: హైదరాబాద్‌లోని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జాతీయ కార్యాలయంలో ఈనెల 14 నిర్వహించనున్న రాష్ట్ర కమిటీ సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుగౌడ్ అన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



బెజ్జూర్: వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

బెజ్జూర్: కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మెకు మంగళవారం మద్దతు పలికారు. ఆయన మాట్లాడుతూ మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులకు రూ.19,600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ యూనియన్ కార్యదర్శి మోర్లే నగేశ్, సీఐటీయూ కన్వీనర్ గోరంట్ల వసంత్, అజీజ్, సలీమ్, నగేష్ పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో..

ఆసిఫాబాద్‌అర్బన్: తమ డిమాండ్లను సత్వరమే నెరవేర్చాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు ప్రారంభించిన సమ్మె మంగళవారం ఆరో రోజుకు చేరింది. కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లోని పరిశుభ్రతలో కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని, అలాంటి కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. నాయకులు సీహెచ్ శంకర్, సమ్మయ్య, మట్టరాజు, శ్రీకాంత్, ప్రభాకర్, మహేష్, సునీల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి కార్మికులు వినతిపత్రం అందించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె చేస్తున్నట్లు తెలిపారు.

కౌటాలలో..

కౌటాల: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించే దాకా సమ్మె చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఆయన మంగళవారం మద్దతు తెలిపారు. సమ్మెలో కార్మికులు కరుణాకర్, నాగేశ్, మోరేశ్వర్, రాజారం, రవి తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి)లో..

సిర్పూర్(టి): గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీరికి మద్దతుగా బీఎస్పీ నాయకులు దుర్గం ప్రవీణ్‌కుమార్, భూపల్లి తిరుపతిలు ధర్నాలో పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టిన పంచాయతీ కార్మికులు మంగళవారం సమ్మెలో భాగంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. జేఏసీ నాయకులు ఉపేందర్, రమేశ్, సుధాకర్, కార్మికులు దేవాజీ, శ్రీనివాస్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



కెరమెరిలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కెరమెరి: మండలంలోని కెస్లాగూడ, ఖైరీ, సాంగ్వి తదితర రైతు వేదికల ఎదుట మంగళవారం బీఆర్ఎస్ నాయకులు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఎంపీపీ పెందోర్ మోతిరాం, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం మాట్లాడుతూ రాష్ట్రంలో ఉచిత విద్యుత్ అవసరం లేదనడం దుర్మార్గపు చర్యని విమర్శించారు.

తిర్యాణిలో..

తిర్యాణి: రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు తిరస్కరించాలని జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఉచిత విద్యుత్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం మండలంలోని చింతపెల్లి రైతు వేదిక వద్ద నిరసన వ్యక్తం చేశారు. రైతుబంధు సమితి అధ్యక్షుడు బొమ్మగొని శంకర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, ఉపసర్పంచ్ తోట లచ్చన్న, బీఆర్ఎస్ పార్టీ నాయకులు శంకర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: రైతులపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని రైతుబంధు జిల్లా అధ్యక్షుడు కొండ్ర జగ్గాగౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో బుధ, గురువారాల్లో రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

రెబ్బెనలో..

రెబ్బెన: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద బీఆర్ఎస్ నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, సర్పంచ్‌లు సోమశేఖర్, అహల్యాదేవి, వైస్ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీటీసీ మధునయ్య, హరిత, నాయకులు మదునయ్య, వినోద్‌జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికుల నిరసన



కెరమెరి: నిరసన తెలుపుతున్న కార్మికులు

కెరమెరి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఏళ్లుగా ససమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కంబాల లక్ష్మి, లలిత, రజిత, కవిత, కమల తదితరులు ఉన్నారు.

తిర్యాణిలో..

తిర్యాణి: మధ్యాహ్న భోజన పథకంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ రిసోర్స్ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్ష మంగళవారం రెండోరోజుకు చేరుకుంది. ఎండీఎం కార్మిక సంఘం మండల అధ్యక్షులు చంద్రకళ, లక్ష్మి, విమల తదితరులు ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం ఎదుట కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లోని మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. మధ్యాహ్న భోజన నిర్వహణను అక్షయ పాత్ర వంటి సంస్థలకు ఇవ్వొద్దన్నారు. సమ్మెలో భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు శారద, లక్ష్మి, కమల, తార, హంస, విమల తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్ (టి)లో..

సిర్పూర్(టి): మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక ఎంఈవో కార్యాలయం ఆవరణలో చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. వీరికి మద్దతుగా బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రవీణ్‌కుమార్, మండల అధ్యక్షుడు భూపల్లి తిరుపతి నిరసనలో పాల్గొన్నారు.

దహెగాంలో..

దహెగాం: మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్ల సాధనకు చేపడుతున్న టోకెన్ సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరింది. మండల కేంద్రంలో కార్మికులు ర్యాలీ చేపట్టారు. అనంతరం సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల క్రిష్ణమాచారి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో వంట చేస్తున్న వారికి చెందిన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట టోకెన్ సమ్మె చేస్తున్నందున పెద్ద ఎత్తున మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొనాలని కోరారు.

రెబ్బెనలో..

రెబ్బెన: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాయతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎంపీ బండి సంజయ్ జన్మదిన వేడుకలు

కాగజ్‌నగర్‌టౌన్: బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

రెబ్బెన: సింగరేణిలోని అన్ని ఏరియాల పర్సనల్ డిపార్టుమెంట్ అధికారులతో మంగళవారం జీఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్‌సీ కే.బసవయ్య వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. 11వ వేజ్‌బోర్డు కింద సవరించిన పే స్కేల్ అమలు, న్యాయస్థానం పరిధిలో ఉన్న కేసులు, కార్పొరేట్ మెడికల్ బోర్డు అంశాలపై చర్చించారు.

అధికారులపై విచారణ చేపట్టాలి

కెరమెరి: జోడేఘాట్‌లోని బృహత్ పల్లె ప్రకృతివనంలోని మొక్కలకు సంబంధించి అవినీతికి పాల్పడిన అధికారులపై విచారణ చేపట్టాలని కుమురం భీం పోరు గ్రామాల అధ్యక్షుడు పెందోర్ రాజేశ్వర్ కోరారు. ఈమేరకు మంగళవారం జోడేఘాట్ గ్రామాల ప్రజలతో కలిసి ఎంపీడీవో మహేందర్‌కు వినతిపత్రం అందజేశారు. సిడాం భీంరావు, కుమురం మారుతి, కుమురం లక్కెరావు, ఆత్రం రాజు తదితరులు ఉన్నారు.

పారిశుధ్య పనుల అడ్డగింత

బెజ్జూర్: మండల కేంద్రంలో మంగళవారం తాత్కాలిక పారిశుధ్య పనులను గ్రామపంచాయతీ కార్మికులు అడ్డుకున్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది సమ్మె చేస్తుండడంతో సర్పంచ్ శారద, ఉపసర్పంచ్ అడ్డూరు రాజేష్, పంచాయతీ కార్యదర్శి పెదమ్ తుకారాంలు తాత్కాలిక సిబ్బందితో పారిశుధ్య పనులు చేయించారు. ఈక్రమంలో పనులను పారిశుధ్య సిబ్బంది అడ్డుకున్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ మండల అధ్యక్షుడు

బెజ్జూర్: బెజ్జూర్ మండలం బీజేపీ అధ్యక్షుడు జాడి దిగంబర్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కౌటాల మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం మండల కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, మండల ప్రాథమిక సహకార సంఘం మాజీ చైర్మన్ డోకె వెంకన్న ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సిడాం సకారాం, నాయకులు ఇంజిరి రాజారాం, జావిద్ పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని జిల్లా ఓటరు నమోదు నోడల్ అధికారి ఊశన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. 2005 అక్టోబర్ 1కి ముందు జన్మించి ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ రామ్మోహన్‌రావు, సిబ్బంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో వంట చేసిన ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్‌రూరల్: పెండింగ్‌లో ఉన్న వంట బిల్లులు, వేతనాలు విడుదల చేయాలని మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెతో కొన్ని పాఠశాలల్లో మంగళవారం ఉపాధ్యాయులే వంట చేసి విద్యార్థులకు వడ్డించారు. ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో వంటలు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ విమలబాయి

వాంకిడి: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ హేమంత్ బొర్కడేకు ఎంపీపీ ముండె విమలబాయి వినతిపత్రం అందజేశారు. మండల వ్యాప్తంగా బీసీ జనాభ అధికంగా ఉన్నందున కేజీబీవీ పాఠశాలలో బీసీ సీట్ల సంఖ్య పెంచాలని కోరారు. మండల కేంద్రంలోని లక్ష్మీనగర్ కాలనీలో ఇళ్ల స్థలాలకు పట్టాలు అందించాలని, క్రీడా మైదానాలు, బీటీ రహదారుల నిర్మాణాలు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.